13న వర్ధనగర్ కాలనీవాసుల సమావేశం

హయత్‌నగర్: వర్ధనగర్ కాలనీలో అభివృద్ధి పనుల పురోగతిపై చర్చించేందుకు ఈ నెల 13వ తేదీ ఉదయం కాలనీవాసుల సమావేశం నిర్వహించనున్నట్టు కాలనీ సంక్షేమ సంఘం నాయకులు తెలిపారు. కాలనీవాసులందరూ చేయిచేయి కలిపి కాలనీ కమ్యూనిటీ హాల్, ప్రహరీ, పోచమ్మ తల్లి గుడి నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. నిధుల కొరత కారణంగా ఆయా పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. ఆయా నిర్మాణాలకు ఇప్పటి వరకు అయిన ఖర్చులు, ఇంకా అవసరమైన నిధుల వివరాలను సమావేశంలో తెలిజేయనున్నట్లు తెలిపారు. అలాగే పోచమ్మ తల్లి గుడి శంకుస్థాపన తేదీతో పాటు ఇతర ముఖ్య అంశాలపై కూడా చర్చించనున్నట్లు వెల్లడించారు. కాలనీ అభివృద్ధిలో భాగస్వాములుగా ఉండేందుకు కాలనీ వాసులందరూ తప్పకుండా ఈ సమావేశానికి హాజరవ్వాలని కోరారు.

కుంట్లూర్ నుంచి జేబీఎస్‌కు బస్సు



బస్సును ప్రారంభిస్తున్న డీఎం వెంకటేశ్వర్లు

నాగోలు: కుంట్లూర్ నుంచి జేబీఎస్ బస్ స్టేషన్ వరకు 90బీ/కే నూతన బస్సు సర్వీసును గురువారం బండ్లగూడ ఆర్టీసీ బస్ డిపో నుంచి మేనేజర్ వెంకటేశ్వర్లు ప్రారంభించారు. కొత్తగా ప్రారంభించిన బస్సు సర్వీస్‌ను స్థానికులు ఉపయోగించుకోవాలని సూచించారు. విద్యార్థుల ఇబ్బందులు దృష్టిలో పెట్టుకొని బీజేపీ సీనియర్ నాయకులు చరణ్‌రెడ్డి, నాగోలు డివిజన్ బీజేపీ అధ్యక్షుడు పంగా శ్రీకాంత్ గతంలో డిపో మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు. వారి వినతిపత్రానికి స్పందించి నూతన బస్సు ఏర్పాటు చేసిన బండ్లగూడ బస్ డిపో మేనేజర్ వెంకటేశ్వర్లుకు వారు ధన్యవాదాలు తెలిపారు. బస్సు ప్రారంభోత్సవంలో నాయకులు యెల్ల పంతుల చంద్రశేఖర్, కాలం శెట్టి లయ, ఎడ్ల రాజేష్, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

త్వరలో రాజీవ్ యువ వికాస్ రుణాల పంపిణీ

చాదర్‌ఘాట్: రాజీవ్ యువ వికాస్ రుణాలను అర్హులైన వారికి రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన పంపిణీ చేయనున్నట్లు అంబర్‌పేట తహసీల్దార్ వీరాబాయి తెలిపారు. గురువారం ఆమె కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ... ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించలేని వారు నేరుగా జీహెచ్ఎంసీ వార్డు కార్యాలయంలోని ప్రత్యేక సహాయ కేంద్రంలో అందజేయాలని సూచించారు. ఓల్డ్‌మలక్‌పేట డివిజన్‌లోని వార్డు కార్యాలయంలో దరఖాస్తులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కేంద్రంలో సమర్పించాలన్నారు. అర్హులైన వారికి జూన్ 9వ తేదీలోగా యూనిట్లు మంజూరు చేస్తామని తెలిపారు. రూ. 50 వేల నుంచి రూ. 2 లక్షల వరకు 90 శాతం రాయితీ, 10 శాతం బ్యాంక్ రుణం లభిస్తుందని తెలిపారు. అలాగే రూ. 2 లక్షల నుంచి రూ. 4 లక్షల వరకు 70 శాతం రాయితీతో పాటు 30 శాతం బ్యాంక్ రుణం అందజేయనున్నట్లు ఆమె తెలిపారు.

వేడుకగా విగ్రహ ప్రతిష్టాపనోత్సవం

మలక్‌పేట: దిల్‌సుఖ్‌నగర్ మారుతి మందిర్‌లో గురువారం పంచలోహ హనుమంతుని విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. చిల్లా నిరంజన్ రెడ్డి, అలివేలు దంపతులు స్వామి వారి విగ్రహం, పల్లకిని దేవాలయ కమిటీకి అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రహ్లాద శర్మ పూజలు చేసి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ధర్మకర్తలు చిట్టంపల్లి కిరణ్‌కుమార్, బొట్టు శ్రీనివాస్ దంపతులను ఆలయ మర్యాదలతో సన్మానించారు. సి.హెచ్.రాజగోపాల్‌రెడ్డి, సంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే కార్మిక శ్రేయస్సు



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్

హస్తినాపురం: కార్మికుల శ్రమ దోపిడీ, సామాజిక అణచివేత వివక్షతల అణచివేతల అంతం పోరాటాల ద్వారానే సాధ్యపడుతుందని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.చంద్రమోహన్ అన్నారు. బీటీ రమణదివే వర్ధంతి, జ్యోతి రావుపూలే, బీఆర్ అంబేడ్కర్‌ల జయంతులను జయప్రదం చేయాలని సీఐటీయూ ఎల్‌బీనగర్ సర్కిల్ కమిటీ ఆధ్వర్యంలో నందనవనంలో అనుబంధ సంఘాల సమావేశం గురువారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన చంద్రమోహన్ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో నేటికీ అక్కడక్కడ పలు పరిశ్రమలు, విద్యాలయాలలో చాప కింద నీరులా కుల వివక్షత కొనసాగుతున్నదన్నారు. దాని నిర్మూలన కోసం అందరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు రామస్వామి సమావేశానికి అధ్యక్షతన జరిగిన సమావేశంలో నేత ఏలేటి ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆజంపుర కార్యాలయంలో...

28 స్లాట్ బుకింగ్స్.. 26 రిజిస్ట్రేషన్లు



ఆజంపుర రిజిస్ట్రేషన్ కార్యాలయంలో పరిశీలిస్తున్న హైదరాబాద్ డీఐజీ సైదిరెడ్డి, జిల్లా రిజిస్ట్రార్ (దక్షిణం) తులసి, పక్కన ఎస్‌ఆర్‌ఓ సంధ్య

మలక్‌పేట: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన స్లాట్ బుకింగ్ విధానం మూసారంబాగ్‌లోని ఆజంపుర రిజిస్ట్రేషన్ కార్యాలయంలో గురువారం తొలివిడతగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించారు. స్లాట్ బుకింగ్ చేసుకున్న వారికి మాత్రమే రిజిస్ట్రేషన్లు పూర్తి చేశారు. హైదరాబాద్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్(డీఐజీ) ఎస్.సైదిరెడ్డి, హైదరాబాద్ జిల్లా (దక్షిణం) రిజిస్ట్రార్ ఆర్.తులసి రిజిస్ట్రేషన్ల ప్రకియ పరిశీలించారు. రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన వారికి కలిగిన సందేహాలను నివృత్తి చేశారు. మొదటి స్లాట్ బుకింగ్ రిజిస్ట్రేషన్‌కు దాదాపు 45 నిమిషాల సమయం పట్టింది. తదుపరి రిజిస్ట్రేషన్లు 20 నుంచి 30 నిమిషాల వ్యవధిలో పూర్తి అయ్యాయి. మరో అరగంటలో రిజిస్ట్రేషన్ పత్రాలు సంబంధిత వ్యక్తులకు అందజేశారు. డాక్యుమెంటరీ రైటర్లు తప్పిదాలు దొర్లకుండా స్లాట్ బుకింగ్ చేస్తే రిజిస్ట్రేషన్ సకాలంలో పూర్తి అవుతున్నాయని అధికారులు తెలిపారు. ఒక్క రోజుకు 48 స్లాట్ బుకింగ్ అందుబాటులో ఉండగా.. 28 స్లాట్ బుకింగ్ అయ్యాయి. వాటిలో 26 రిజిస్ట్రేషన్లు పూర్తి అయ్యాయని ఎస్ఆర్‌వో సంధ్య తెలిపారు. మిగిలిన రెండింటివి మళ్లీ స్లాట్ బుకింగ్ చేసుకుని రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు.

తగ్గిన రద్దీ

స్లాట్ బుకింగ్ విధానంతో కార్యాలయం వద్ద ప్రజల రద్దీ తగ్గింది. గతంలో రిజిస్ట్రేషన్ కోసం వారి అనుకూల పరిస్థితులను బట్టి కార్యాలయానికి వచ్చేవారు. వందల కొద్ది మంది కార్యాలయానికి రావడంతో సందడిగా ఉండేది. ఇప్పుడు ఆపరిస్థితి లేదు. స్లాట్ బుకింగ్ చేసుకున్న వారు మాత్రమే రావడంతో కార్యాలయం, పరిసర ప్రాంతాలు రద్దీ లేకుండా ప్రశాంతంగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ కొనసాగుతోంది.

గంటలో అన్ని పనులు పూర్తి



స్లాట్ రిజిస్ట్రేషన్ కోసం వచ్చాం. స్లాట్ బుకింగ్ చేసుకున్నాం. ఆఫీసులో వచ్చిన తరువాత గంట లోపు అన్ని పనులు పూర్తి అయ్యాయి. 30 నిమిషాల్లో రిజిస్ట్రేషన్, తరువాత రిజిస్ట్రేషన్ పత్రాలు వచ్చాయి. స్లాట్ బుకింగ్ విధానం బాగుంది. సర్కార్ చెప్పిన టైమ్ ప్రకారం 10 నుంచి 15 రిజిస్ట్రేషన్ పూర్తి కాలేదు. మొదటి రోజు కాబట్టి కొంత ఆలస్యం జరిగింది.

– జెక్కా మోహన్‌రెడ్డి, మూసారంబాగ్

ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి

సీసీఎస్ అడిషనల్ డీసీపీ మనోహర్



రక్తదాన శిబిరంలో పాల్గొన్న సీసీఎస్ అడిషనల్ డీసీపీ మనోహర్

వనస్థలిపురం: గర్భిణులు, కిడ్నీ బాధితులు, తలసేమియా వ్యాధిగ్రస్తులు, ప్రమాదాలకు గురైనవారు, బైపాస్ సర్జరీ రోగులు, కేన్సర్ పేషెంట్స్ సకాలంలో రక్తం అందక అనేక ఇబ్బందులు పడుతున్నందున ఆరోగ్యవంతులందరూ రక్తదానం చేయాలని సీసీఎస్ అడిషనల్ డీసీపీ గాదరి మనోహర్ అన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకొని మదర్ థెరీసా చారిటబుల్ సొసైటీ అధ్యక్షుడు చేపూరి శంకర్ ఆధ్వర్యంలో తలసేమియా రోగుల కోసం బీఎస్‌రెడ్డినగర్ డివిజన్ సెల్ఫ్ ఫైనాన్స్ కాలనీలో గురువారం చేపట్టిన రక్తదానం శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. రక్తదాన శిబిరాన్ని నిర్వహించిన శంకర్‌ను ఆయన అభినందించారు. రక్తదానం చేసిన యువకులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. నిర్వాహకుడు శంకర్ మాట్లాడుతూ... ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించాన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జనార్ధన్‌రెడ్డి, నాయకులు సతీష్‌గౌడ్, శ్రీధర్‌గౌడ్, సంజయ్‌కుమార్, సిద్ధార్థ కుమార్, వెంకట్‌రెడ్డి, కృష్ణ, సుధాకర్ శర్మ, బాలరాజు, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్లలో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉననాయి. టమాట కిలో రూ. 13, వంకాయ 18, బెండ 40, పచ్చి మిర్చి 35, కాకర 35, బీర 45, క్యాబేజి 8, ఫ్రెంచిబీన్స్ 65, క్యారెట్ 17, దొండ 18–23, చిక్కుడు 55, గోకర 35, బీట్‌రూట్ 13, క్యాప్సికం 35, ఆలుగడ్డ 24, దోస 18, సొరకాయ 9, పొట్లకాయ 18, ఉల్లిగడ్డ 20, చామ గడ్డ రూ. 35 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

14న జై భీమ్ ర్యాలీ

నాగోలు: భారతరత్న డాక్టర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని ఎల్‌బీనగర్‌లోని అంబేడ్కర్ విగ్రహం నుంచి ఈ నెల 14న నెక్లెస్ రోడ్డులోని 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం వరకు జై భీమ్ ర్యాలీ నిర్వహించనున్నారు. అందుకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం నాగోలులో తన నివాసం టీపీసీసీ ప్రచార కమిటీ కో కన్వీనర్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా ఆవిష్కరించారు. నేతలు నక్క మహేష్ మాదిగ, జేఏసీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, గుర్రం కొటేష్ మాదిగ, జేఏసీ రాష్ట్ర నాయకులు మేడి ప్రసాద్ మాదిగ జేఏసీ యువజన రాష్ట్ర నాయకులు, కొత్తపల్లి అన్వేష్ మాదిగ, జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

కత్తిపోట్లకు గురైన గిరిజన మహిళ మృతి

నాగోలు: మూడు రోజుల క్రితం కత్తిపోట్లకు గురైన వర్త్య లక్ష్మి అనే గిరిజన మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఎల్‌బీనగర్ పోలీసుల సమాచారం మేరకు... ఈ నెల 8న రాత్రి సరూర్‌నగర్ పోస్టాఫీస్‌కు వెళ్లే దారిలో ఉన్న రిషి కిచెన్ వెను మరి కొందరు మహిళతో కలిసి ఆమె వేచి ఉంది. ఆ సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి లక్ష్మిపై కత్తులతో విచక్షణ రహితంగా దాడి చేశారు. దీంతో ఆమె తీవ్రంగా గాయపడిన ఆమెను దిల్‌సుఖ్‌నగర్‌లోని కృతిక హాస్పిటకు తరలించారు. హాస్పిటల్‌లో గురువారం అర్ధరాత్రి దాటిన తరువాత లక్ష్మి మృతి చెందింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గ్యాస్ ధర తగ్గించకపోతే ఉద్యమిస్తాం

మీర్‌పేట: పెంచిన గ్యాస్ ధరలను కేంద్ర ప్రభుత్వం వెంటనే తగ్గించాలని సీపీఎం పార్టీ బాలాపూర్ మండల నాయకుడు యాదయ్యాచారి డిమాండ్ చేశారు. గ్యాస్ ధరలను తగ్గించాలని గురువారం మీర్‌పేట కార్పొరేషన్ పరిధి బాలాపూర్ చౌరస్తాలో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే పెరిగిన నిత్యావసరాల ధరలతో పేద, మధ్య తరగతి ప్రజలు సతమతమవుతుంటే, తాజాగా గ్యాస్ ధర పెంపుతో సామాన్యులపై మరింత భారం పడుతుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరుగ్యారంటీల పేరుతో ప్రజలను మభ్యపెట్టి మోసం చేస్తోందని ఆరోపించారు. గ్యాస్ ధరలు తగ్గించకపోతే పెద్దఎత్తున ఉద్యమిస్తామని యాదయ్యాచారి హెచ్చరించారు.

చంపాపేటను ఆదర్శంగా తీర్చిదిద్దుతా



సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్

చంపాపేట: చంపాపేట డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో నెలకున్న సమస్యలన్నింటినీ ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరించి డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దటమే తన ప్రధాన లక్ష్యమని కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన దుర్గాభవానీనగర్ కాలనీలో సర్కిల్ అధికారులతో కలసి పాదయాత్ర నిర్వహించారు. చెత్త కుప్పలు, పడకేసి పారిశుద్ధ్యం, గుంతలుగా మారిన కాలనీ అంతర్గత రహదారులు, రహదారుల ఇరువైపుల ఏపుగా పెరిగిన చెట్ల కొమ్మలు వంటి సమస్యలను పరిశీలించారు. ఆయా సమస్యలు పరిష్కరించాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. సర్కిల్ ఏఈ గోపాల్‌కృష్ణ, సిబ్బంది రాజు, వాటర్ వర్క్స్ మేనేజర్ రమ్యభారతి, కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు రమేష్‌రెడ్డి, నిశీకాంత్‌రెడ్డి, నాగేశ్వరరావు, యశ్వంత్, మురళీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో వసతుల కల్పనకు కృషి



హస్తినాపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించిన కార్పొరేటర్ సుజాతనాయక్

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మౌలిక వసతులను కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాతనాయక్ అన్నారు. గురువారం హస్తినాపురం డివిజన్ పరిధిలోని విరాట్‌నగర్‌కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను కార్పొరేటర్ సందర్శించారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను విద్యార్థులు, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. వారు మంచినీటికి ఇబ్బందులు ఉన్నాయని కార్పొరేటర్ దృష్టికి రావడంతో స్పందించిన కార్పొరేటర్ సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే మంచినీటి సరఫరా చేయాలని ఆదేశించారు. అనంతరం సుజాతనాయక్ మాట్లాడుతూ... డివిజన్ పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో కనీస వసతులైన మంచినీరు, మరుగుదొడ్ల వసతి కల్పించేందుకు సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటాని అన్నారు.

సమస్యల పరిష్కారానికి క్రైస్తవులు సంఘటితం కావాలి



హాజరైన పాస్టర్లు, క్రైస్తవ సంఘాల నాయకులు

మలక్‌పేట: సమాజంలో ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం క్రైస్తవులు సంఘటితం కావాలని మలక్‌పేట క్రిస్టియన్ అసోసియేషన్ అధ్యక్షుడు డేవిడ్ అన్నారు. సలీంనగర్‌లోని చర్చ్ ఆఫ్ గాడ్ మందిరంలో గురువారం జరిగిన మలక్‌పేట నియోజకవర్గం పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశానికి ఆయన హజరై మాట్లాడారు. ఈ సందర్భంగా హైదరాబాద్ హోలీ క్రాస్ మినిస్ట్రీస్ నిర్వాహకులు రెవరెండ్ కీర్తి ప్రకాశ్, జేసీబీసీఎమ్ హిందీ చర్చి చైర్మన్ పాస్టర్ ధన్‌రాజ్ హాజరై బైబిల్ లేఖనాలు బోధించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో చర్చి ఆఫ్ క్రైస్ట్ మినిస్ట్రీస్ నిర్వాహకులు రెవరెండ్ డాక్టర్ ఇర్మియా, పాస్టర్లు శాంత్‌కుమార్, నరేందర్, నాయకులు శ్యామ్, క్రైస్తవులు పాల్గొన్నారు.


రాజ్యాంగ విలువలను రక్షించుకుందాం: సీపీఐ



ధర్నా చేస్తున్న సీపీఐ నేతలు

మన్సూరాబాద్: దేశాన్ని మతోన్మాద బీజేపీ నుంచి కాపాడుకుందామని... ప్రజాస్వామ్య స్ఫూర్తితో రాజ్యాంగాన్ని రక్షించుకుందామని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందోజు రవీంద్రాచారి, నియోజకవర్గ కార్యదర్శి సామిడి శేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సీపీఐ జాతీయ కమిటీ పిలుపుమేరకు సీపీఐ హయత్‌నగర్ మండల కార్యదర్శి శేషరాజుపల్లి శ్రీదేవి ఆధ్వర్యంలో హయత్‌నగర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం ధర్నా చేపట్టి నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మోదీ అధికారంలోకి వచ్చిన 11 సంవత్సరాల్లో దేశంలో ప్రజాస్వామిక వాదులపై, ప్రశ్నించే నాయకులపై దాడులు, హత్యలు జరుగుతున్నాయని మండిపడ్డారు. బీజేపీ హఠావో... దేశ్‌కో బచావోను దేశ ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు. నాయకులు అరుణ్‌కుమార్‌గౌడ్, మర్రి శోభన్, సామిడి వంశీవర్ధన్‌రెడ్డి, రమావత్ సక్రు, సుజాత, మాధవరెడ్డి, శివజ్యోతి, ఆదిలక్ష్మి, యమున, సౌజన్య, సుశీల, నాగరాజు, శ్రీకాంత్, సురేందర్, సరిత, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న మహాలక్ష్మీ యాగం



యాగంలో పాల్గొన్న త్రిదండి శ్రీరామచంద్ర రామానుజ జీయర్ స్వామి తదితరులు



సాంస్కృతిక కార్యక్రమంలో చిన్నారులు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్‌లోని వాసవి కాలనీలోని అష్టలక్ష్మీ దేవాలయంలో శ్రీ మహాలక్ష్మీ యాగంలో భాగంగా గురువారం ఆలయంలో వేద ఇతిహాస పురాణ స్తోత్ర దివ్య ప్రబంధ విన్నపం, చతుస్థానార్చన, ప్రధాన యాగశాలలో యజ్ఞ కార్యక్రమాలు నిర్వహించారు. ఇష్టి యాగశాలలో విద్యార్థుల విద్యాభివృద్ధికి అద్భుతమైన జ్ఞానప్రాప్తికి శ్రీ లక్ష్మీ హయగ్రీవ స్వామి పరిపూర్ణ కృపాకటాక్షాలకు హయగ్రీవ ఇష్టి యజ్ఞం నిర్వహించారు. శ్రీ విష్ణు సహస్ర నామ స్తోత్ర పారాయణం, యజ్ఞం నిర్వహించారు. జీయర్ స్వాములకు ఆచార్యులు 200 మంది ఉభయ వేదాంత పండితులకి గురువులైన శ్రీ ఉదయ వేదాంత ప్రవర్తకాచార్యులు కులపతులు న్యాయ వేదాంత విద్వాన్ తెలికచర్ల కందాడై గోపాలాచార్య స్వామివారి స్మృతి (ఆచార్య కై ంకర్యంగా) నిర్వహించారు. ప్రతివాది భయంకర అణ్ణంగరాచార్య స్వామివారికి (సీతారామ్ భాగ్ స్థానాచర్యులు) గోపాల దేశిక పురస్కార సమర్పణ నిర్వహించారు. పూజా కార్యక్రమంలో శ్రీ భాష్యకారసిద్ధాంతపీఠ వ్యవస్థాపకాచార్యులు శ్రీ త్రిదండి శ్రీరామచంద్ర రామానుజ జీయర్ స్వామి భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ సోమ సురేష్, ఫౌండర్ చైర్మన్ గౌరిశెట్టి చంద్రశేఖర్‌గుప్త, మాజీ చైర్మన్ బంధం దామోదర్, ప్రధాన కార్యదర్శి గంప జగన్, కోశాధికారి అయిత అంజయ్య, వైస్ చైర్మన్ నాగమల్లి శ్రవణ్‌కుమార్, సెక్రటరీ దాచేపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాల్‌రెడ్డి సేవలు చిరస్మరణీయం



సామ బాల్‌రెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న మాజీ కార్పొరేటర్ సామ రమణారెడ్డి

చంపాపేట: చంపాపేట గ్రామ పంచాయితీ సర్పంచ్‌గా మూడు దశాబ్దాల పాటు నిబద్ధతతో పనిచేసి పేద ప్రజలకు అవిరళ సేవలు అందించిన దివంగత సామ బాల్‌రెడ్డి చిరస్మరణీయులని చంపాపేట మాజీ కార్పొరేటర్ సామ రమణారెడ్డి అన్నారు. గురువారం బాల్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా చంపాపేట చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నాయకులు కట్టా వెంకటేష్, మంత్రి జగన్, మెట్టు సంజీవరెడ్డితో కలసి బాల్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ... సామ బాల్‌రెడ్డి ఆశయాలు యువతకు ఆదర్శమన్నారు. అనంతరం చంపాపేట చౌరస్తాలో బాల్‌రెడ్డి మనుమడు సామ గౌతమ్‌రెడ్డి, వంశీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో వందలాది మంది పేదలకు అన్నదానం చేశారు. స్థానిక నేతలు సారయ్య, ఏడ శంకర్, నేతాజీ యువజన సంఘ అధ్యక్షుడు బైగళ్ల రవీందర్, నాయకులు యాదగిరి, ఆరె కృష్ణ, బెక్కం లక్ష్మీనారాయణ, నర్సింగరావు, సంజన్న, భానుప్రకాష్‌రెడ్డి, రాము, లక్ష్మణ్, పలు పార్టీల నాయకులు, కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

చలివేంద్రాలతో దాహార్తికి చెక్



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: వేసవిలో పాదచారులు, వాహనదారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో ఉపకరిస్తాయని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. ది హైదరాబాద్ ఆటోనగర్ మెకానికల్, టెక్నీషియన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆటోనగర్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... వేసవిలో పెరుగుతున్న ఎండలను దృష్టిలో ఉంచుకుని ఆటోనగర్ పారిశ్రామిక వాడలో సామాజిక బాధ్యతగా చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి డ్రైవర్లు, ఇతర వర్కర్స్‌ల దాహర్తిని తీర్చడం అభినందనీయమన్నారు. తొలిరోజుగా మజ్జిగను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కొండ కృష్ణ, జగన్, నేతలు రవికుమార్, సత్యనారాయణ, బాలకృష్ణ, బాబ, నాయకులు గుండే కిరణ్‌కుమార్, పాతూరి శ్రీధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ విజయం తథ్యం



ఐఎస్‌సదన్ కార్పొరేటర్‌ను కలిసిన బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి గౌతమ్‌రావు

సైదాబాద్: హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ విజయం ఖాయమని ఆ పార్టీ అభ్యర్థి గౌతమ్‌రావు ధీమా వ్యక్తం చేశారు. గురువారం ఆయన ఐఎస్‌సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేతమధుకర్‌రెడ్డిని ఆమె ఇంట్లో కలుసుకున్నారు. కార్పొరేటర్ ఆయనను శాలువాతో కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గతంలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిచిన మాదిరిగానే నైతిక బలంతో ఈ ఎన్నికల్లోనూ బీజేపీ ఘన విజయం సాధిస్తుందని అన్నారు. బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్ రెడ్డి, పార్టీ డివిజన్ అధ్యక్షుడు గిరిధర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు అమర్‌నాథ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, మహేశ్, శ్రీకాంత్, ప్రశాంత్, విశాల్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో సోదరి హత్య కేసు నిందితుడు

చాదర్‌ఘాట్: సొంత అక్కను హతమార్చిన సంఘటనలో నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నట్లు చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపారు. వివరాలివీ... ఓల్డ్‌మలక్‌పేటలోని వెంకటరమణ అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్న అనసూయ (90) కుటుంబ సభ్యులు ఒక కూతురు, కొడుకులు సుదర్శన్(70) మదన్‌రావు(63). బుధవారం అర్ధరాత్రి మదన్‌రావు తాగి వచ్చి తల్లిని డబ్బులు అడిగాడు. డబ్బులు అడగవద్దు అని వారించగా కోపోద్రిక్తుడైన మదన్‌రావు వంటగదిలో ఉన్న కత్తితో అక్క లక్ష్మి(68)ని పొడిచి హతమార్చాడు. అడ్డుకోబోయిన అన్న సుదర్శన్‌ను కత్తితో గాయపరిచాడు. దీనిపై పోలీసులకు సమాచారం రావడంతో అక్కడికి చేరుకున్న పోలీసులు నిందితుడు మదన్‌రావును అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసుకొని విచారిస్తున్నారు. ఆ కుటుంబంలో ఎవరికీ వివాహం కాకపోవటం, అందరూ మానసికంగా మంచిగా లేక పోవటం, పెన్షన్ డబ్బుల విషయంలో గొడవలు జరగటం హత్యకు కారణంగా తెలుస్తుందని ఇన్‌స్పెక్టర్ వెల్లడించారు. తండ్రి రిటైర్ ఆర్మీ ఉద్యోగి. రెండు సంవత్సరాల క్రితం మృతి చెందినట్లు, అతని పెన్షన్ తల్లికి రావటం, ఈ గొడవలకు కారణంగా పోలీసులు తెలిపారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

ఎల్‌బీనగర్ డీసీపీ ప్రవీణ్‌కుమార్



మాట్లాడుతున్న డీసీపీ ప్రవీణ్‌కుమార్

లింగోజిగూడ: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటివారైనా కఠిన చర్యలు తీసుకుంటామని ఎల్‌బీనగర్ డీసీపీ ప్రవీణ్‌కుమార్ హెచ్చరించారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 12 నిర్వహించనున్న ర్యాలీ సన్నాహక సమావేశం గురువారం కర్మన్‌ఘాట్‌లోని లక్ష్మీకన్వెన్షన్‌లో ఏర్పాటు చేశారు. ముఖ్య అతిదిగా హాజరైన డీసీపీ మాట్లాడుతూ... ర్యాలీ రోజు ఉప్పల్ క్రికెట్ స్టేడియంలో మ్యాచ్ ఉందని సిబ్బంది అక్కడికి వెళ్లాల్సి ఉంటుందన్నారు. నిర్వాహకులు ఎలాంటి సంఘటనలు జరగకుండా కొంతమంది వలంటీర్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ర్యాలీ సమయంలో రోడ్డు మొత్తం వెళ్లకుండా ఒకవైపు నుంచి మాత్రమే వెళ్లేలా చూసుకోవాలన్నారు. ర్యాలీలో భారీ శబ్దాలు వచ్చే వాహనాలను వాడకుండా చూడాలని సూచించారు. నిర్వాహకులకు ఎలాంటి ఇబ్బందులు నెలకొన్నా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో ఏసీపీ కృష్ణయ్య, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు పాల్గొన్నారు.